# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన

జూన్ 3, 2011

# బస్తర్‌లో సైన్యం మోహరింపును నిరసించండి!

## 'శిక్షణ' ఒక కుంటిసాకు! ప్రజలను మభ్యపెట్టే ఎత్తుగడ!!

## 'ఆత్మరక్షణ' పేరుతో సైన్యానికి దాడి చేసే అధికారం ఇవ్వడమంటే ఆదివాసుల నరమేధానికీ, అత్యాచారాలకూ అనుమతినివ్వడమే!

సైన్యానికి చెందిన ఒక కాలమ్ కాంకేర్‌లో ప్రవేశించడంతోనే బస్తర్‌లో లాంఛనంగా భారత సైన్యం మోహరింపు ప్రక్రియ మొదలైంది. కానీ దీన్ని దాచిపెడుతూ సైన్యాన్ని ఇక్కడికి పంపుతున్నది శిక్షణ కోసమే తప్ప మావోయిస్టులతో పోరాడడానికి కాదని అబద్ధ ప్రచారం చేస్తున్నారు. మావోయిస్టుల దాడుల నుండి 'ఆత్మరక్షణ' పేరుతో రక్షణశాఖ, న్యాయశాఖలు జారీ చేసినట్టు చెబుతున్న 'గైడింగ్ ప్రిన్సిపుల్స్'ను ఎవరూ వెల్లడించడం లేదు. 'ఆత్మరక్షణ' కోసం దాడులు చేసే అధికారం వాయుసేనకు ముందే ఇచ్చారన్న విషయం గమనార్హం.

దేశ ప్రజలను పక్కదారి పట్టించడం కోసం, ప్రజాస్వామ్య శక్తుల నుండి ఎదురయ్యే నిరసనను దృష్టిలో వుంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పథకం ప్రకారమే 'శిక్షణ' అనే సాకును చెబుతున్నాయి. కానీ ప్రజలపై సాగుతున్న యుద్ధంలో ఇప్పుడు సైన్యాన్ని దించారనేది వాస్తవం. 'శిక్షణ' ఇచ్చేది కూడా ఈ యుద్ధం చెయ్యడం కోసమే. కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాల తర్వాత ఇప్పుడు సైన్యాన్ని దేశం నట్టనడుమ, అత్యంత అణగారిన ప్రజలకు వ్యతిరేకంగా ప్రయోగించబోతున్నారు. కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాల తర్వాత బస్తర్‌లో నల్ల చట్టమైన ఏఎఫ్ఎస్‌పీఏ (సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం)ను అమలు చేయవచ్చనే అనుమానం ఇప్పుడు వాస్తవంగా మారబోతున్నది.

'ఆత్మరక్షణ' అధికారం పేరుతో వాస్తవానికి ప్రభుత్వాలు సైన్యానికీ, వాయుసేనకూ ప్రజలపై దాడి చేసే అధికారం ఇచ్చాయి. ఎందుకంటే ఇక్కడ ఎవరు మావోయిస్టు మిలిటెంట్లు, ఎవరు సాధారణ పౌరులు అని విడదీయగల కొలమానమేదీ వుండదు. 2005 నుండి ఇప్పటి వరకూ, మొదట సల్వాజుడుం పేరుతో, ప్రస్తుతం ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో వరుసగా సాగుతున్న నిర్బంధ క్యాంపెయిన్లలో ప్రభుత్వ సాయుధ బలగాలు దాదాపు 700 గ్రామాల్ని కాల్చివేశాయి. 1500కు పైగా మంది ఆదివాసుల్ని హత్య చేశాయి. వందలాది మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డాయి. పంటల్ని కాలబెట్టాయి. ఇళ్లను దోచుకున్నాయి. పదుల వేల ఆదివాసుల్ని తమ ఇళ్లూవాకిళ్లు వదిలేసి పారిపోయేలా చేశాయి. ఇటీవల చింతల్‌నార్ ప్రాంతంలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన పాశవిక హింసాకాండ ఒక తాజా వుదాహరణ మాత్రమే. ఇప్పుడు సైన్యం మోహరింపు, 'ఆత్మరక్షణ' పేరుతో దానికిస్తున్న అధికారాల మూలంగా ఆదివాసుల నరమేధాలు, బీభత్సకర హింసాకాండ పెద్ద ఎత్తున పెరిగిపోతాయి. దీని వల్ల మొత్తం ఆదివాసీ సమాజపు అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది. ప్రత్యేకించి మాడ్ ప్రాంత మూల నివాసులైన మాడియా ప్రజల జల్-జంగల్-జమీన్‌తో పాటు వాళ్ల అత్యంత ప్రాచీన సాంస్కృతిక వారసత్వం అంతా లుప్తమైపోతుంది.

నేడు బలవంతపు భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్నది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ సంఘటనల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలతో పాటు దోపిడీ వర్గ రాజకీయ పార్టీలన్నీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల భూముల స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేస్తూ తమల్ని తాము 'రైతు బాంధవులు'గా ఫోకస్ చేసుకుంటున్నాయి. కానీ, ఒక అత్యంత వెనుకబడిన ఆదివాసీ ప్రాంతంలో సైన్యం శిక్షణ పేరుతో జరుగుతున్న అది పెద్ద భూస్వాధీనంపై ఈ రైతు 'బాంధవులె'వరూ నోరు మెదపడం లేదు. బీజేపీకి చెందిన రమన్‌సింగ్ ప్రభుత్వం ప్రతిపాదిత మూడు సైనిక శిక్షణా కేంద్రాలలో ఒక దాని కోసం నారాయణ్‌పూర్ జిల్లాలోని మాడ్ ప్రాంతంలో సైన్యానికి 750 చదరపు కిలోమీటర్ల భూమిని అప్పజెప్పాలని చడీచప్పుడు లేకుండా నిర్ణయించింది. దీనిపై ఎలాంటి చర్చ

గానీ, సంప్రదింపులు గానీ లేవు. 'పెసా' చట్టం, ఐదవ షెడ్యూల్ ఇక్కడ వెలవెలపోతున్నాయి. స్థానిక ఆదివాసులకు తాము వేల ఏళ్లుగా నివసిస్తున్న నేల, తమ ప్రాణాల్ని నిలిపి వుంచిన అడవి తమవి కాకుండా పోతున్నాయన్న విషయమే తెలియదు. మాడ్ మొత్తం వైశాల్యం నాలుగు వేల చదరపు కిలోమీటర్లు కాగా దానిలో దాదాపు ఐదో వంతు ఇప్పుడు సైన్యం వశమవుతున్నది. ముందు ముందు దీన్ని విస్తరించే ఆలోచన వున్నట్టు కూడా చెబుతున్నారు. ఇటు సైనిక వాహనాలు బస్తర్‌కు బైల్దేరగానే అటు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) రావ్‌ఘాట్ ప్రాజెక్టును ప్రైవేటీకరిస్తున్నట్టు ప్రకటిస్తూ గ్లోబల్ టెండర్లు పిలవనున్నట్టు చెప్పింది. ఇప్పుడిక దృశ్యం మరింత స్పష్టమవుతుంది. అంటే ఒక వైపు విశాలమైన సైనిక బేస్ నెలకొనగా, మరోవైపు రావ్‌ఘాట్ పర్వతాల్లో అత్యంత విలువైన ఇనుప ఖనిజాన్ని వెలికితీయడానికి, ఇంకా మరెన్నో చోట్ల గనుల తవ్వకం మొదలు పెట్టడానికి, ఆదివాసుల భూముల్ని స్వాధీనం చేసుకోవడానికి పరుగులు తీసే బహుళజాతి కంపెనీలు! ఇప్పుడిక ఎవరెవరు ఎందుకు ఇక్కడికి వస్తున్నారో, వాళ్ల మధ్య సంబంధం ఏంటో అర్థం చేసుకోవడంలో ఇబ్బందే లేదు!!

నేడు దేశంలో అమలవుతున్న సామ్రాజ్యవాద-నిర్దేశిత నయా వుదారవాద విధానాలకు మావోయిస్టు వుద్యమం నుండి రాజకీయంగా ఒక బలమైన ఛాలెంజ్ ఎదురవుతున్నది. ప్రత్యేకించి ఆదివాసుల బాహుళ్యం గల ప్రాంతాల్లో నిక్షిప్తమై వున్న అపార ఖనిజ సంపదల్ని తరలించుకుపోవడం కోసం ఎగబడుతున్న బహుళజాతి కంపెనీల, బడా పెట్టుబడిదారుల దోపిడీని ఎదిరిస్తున్న ఆదివాసుల పోరాటాలు, వాళ్ల పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టులు దేశ పాలక వర్గాలకూ, వాళ్ల సామ్రాజ్యవాద ప్రభువులకూ అతి పెద్ద ప్రమాదంగా తయారయ్యారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలకూ, కార్పొరేట్ కంపెనీలకూ మధ్య జరిగిన వందలాది ఎంవోయూలు ప్రజల నిరసన కారణంగా అమలు కాకుండా పెండింగ్‌లో పడి వున్నాయి. ముఖ్యంగా దండకారణ్యంలో గనులు, భారీ డ్యాంలు, భారీ పరిశ్రమలు మొదలైన కార్పొరేట్ కంపెనీల ప్రాజెక్టులెన్నో ప్రజల సంఘటిత నిరసన, ప్రతిఘటనల వల్ల ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే దండకారణ్యంలో దోపిడీదారుల భారీ 'అభివృద్ధి' బుల్‌డోజర్ ముందుకు సాగలేకపోతున్నది. ఈ కారణం వల్లనే వాళ్లు ప్రజలపై యుద్ధాన్ని ప్రారంభించి, అందులో ఇప్పుడు సైన్యాన్ని మోహరించారు.

బస్తర్ ఆదివాసులు దోపిడీకి, అన్యాయానికీ, దమనకాండకూ, పరాయి పాలనకూ ఎప్పుడూ తలవంచలేదు. బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా ఎన్నో తిరుగుబాట్లు చేసిన సగౌరవ చరిత్ర వాళ్లది. 1910 నాటి మహాన్ భూంకాల్ సమయంలో బస్తర్ ప్రజలను అణిచెయ్యడానికి సైన్యాన్ని దించారు. వందేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు సైన్యాన్ని దించి వాళ్ల న్యాయమైన పోరాటాల్ని నెత్తుటేరుల్లో ముంచాలని చూస్తున్నారు. ఈ ఛాలెంజ్‌ను ధైర్యంగా స్వీకరించాలని మేం దండకారణ్య ప్రజలందరికీ పిలుపునిస్తున్నాం. ప్రజలే చరిత్ర నిర్మాతలు. అంతిమ విజయం ప్రజలదే.

బస్తర్ ప్రాంతంలో సైనిక శిక్షణా కేంద్రాల స్థాపనకు, దాని కోసం భూముల్ని స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా గొంతెత్తాలని మా స్పెషల్ జోనల్ కమిటీ దేశంలోని ప్రజాస్వామ్యప్రియులకూ, మానవహక్కుల సంఘాలకూ, నిర్వాసిత సమస్యపై పోరాడుతున్న సంఘాలకూ, ఆదివాసీ సంఘాలకూ, ఆదివాసుల హితోభిలాషులకూ, మేధావులకూ, రచయితలకూ, కళాకారులకూ, మీడియామిత్రులకూ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నది. శిక్షణా కేంద్రాల ఏర్పాటు సాకుతో ప్రజలపై యుద్ధానికి సైన్యాన్ని మోహరించడాన్ని వ్యతిరేకిస్తూ 'భారత సైన్యం బస్తర్ నుండి వెనక్కి పోవాలి' అనే నినాదంతో ప్రజా వుద్యమాల్ని నిర్మించాలని కోరుతున్నది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న ఎంవోయూలన్నిటినీ, బలవంతంగా భూములను స్వాధీనం చేసుకుంటున్న ప్రాజెక్టులన్నిటినీ రద్దు చేయాలని డిమాండ్ చేయాలని కోరుతున్నది.

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**